# సంవత్సరాది

"సజగ్ నాథ్"
—నవ్యభారతి

ఆనాడు సంవత్సరాది. ప్రాతసంవత్సరమునకు జోహారు. క్రొత్త సంవత్సరమునకు ఆహ్వానము. ఎఱ్ఱగా మండుచున్న నిప్పునైనా బూడిదచేయు చలి కాలముపోయి వినూత్న కళాకాంతులతో, పల్లవింపజేయుక్రియే అవధిగా పెట్టుకొని నవవసంతుడు దర్శనమిచ్చేదినం. క్రిందటి సంవత్సరమంతా భీకర సంగ్రామంతో మునుగుతూ తేలుతూన్నాము. ఈ సంవత్సరమైనా శాంతి సూచనలు కనబడుతాయేమోనని కంఠములుపైకెత్తి దేవుని ప్రార్థించుదినం. స్కూలు విద్యార్థులందరూ ఒకదినమైనా సెలవు వచ్చింది, ఈదినమైనా సుఖంగా ఉందాం అని ఉబలాటపడేదినం. అప్పుడే సంవత్సరమైంది రోజు రోజుకు వృద్ధాప్యం నెత్తినపడుతోంది అని వాపోయేదినం. ఆరోజు ఏకొద్దిమందికోతప్ప చాల మందికి సుఖంగానే వెళ్తుంది...కాలం.

దసరా సెలవులకు పోనేలేదు...వెధవ పరీక్షలు అడ్డంగా వచ్చేయి. ఈమాటైనా వెళ్దామన్న ఆలోచన బాగా పల్లవించింది నా హృదయంలో. ఎప్పుడు వెళ్దామా? ఎప్పుడు తనివితీరా ప్రేయసిముఖాన్ని అవలోకిద్దామా? అనుకొన్న రోజువచ్చింది. రేపే సంవత్సరాదనగా వాలేను అత్తవారంటిలో. ఆరోజు శ్రీవారి ముఖం ఎక్కడా గోచరించలేదు. ప్రొద్దున దంతధావనానికి నీళ్లిస్తున్నప్పుడు, స్నానమప్పుడు తప్ప తీరికసమయాల్లో కనబడకపోవడం వల్ల ఒక తీరని కాంక్ష పైకి ఉబుకుతూనేవుంది.

మధ్యాహ్నం భోజనాలయ్యాయి. తీరికగా పైకి చూస్తూ చేరబడ్డాను...తనలాగ పడుకునేసరికి మెల్లిగా మృదువైన చేతులతో తనకళ్లు ఎవళ్లో మూసినట్టయింది...మా బావఅయి ఉంటాడా?... అతని చేతులు ఇంత మెత్తగా......మామరదలా? ఉంగరంలేదే?—శ్రీవారా...తొందరపడకూడదు... "ఎవరో! క్షమించాలి పోల్చుకోలేక పోయాను" అన్నాను మనస్సులో సిగ్గుబడుతూ "అంతేనా?" అది నేను విన్నట్టుగాలేదే కంఠస్వరం..."ఊహుఁ" అన్నాను. చేతిపట్టువిడిచి పకపకనవ్వింది. పోల్చుకోలేరు కదూ?..." అనీ మరీ విరగబడి నవ్వింది శశి. "అమ్మ శశీ! నువ్వేనా పోల్చుకోలేక పోయాను సుమీ"—అన్నాను......"వచ్చిరదికి తీరుబాటుంటేనా?" అంది..."ఇప్పుడు తీరుబాటైందికదూ" అని చేయిపట్టుకున్నాను..."అబ్బ వదలండి...వేళాపాళా లేదు...అదుగో అమ్మ పిలుస్తున్నాది" అని చెయ్యి విడిపించికొని గిరుక్కునతిరిగి వెళ్లిపోయింది. ఆ తిరగడంలో ఆజడచివర రిబ్బను చుఱ్ఱుమని తగిలింది...

ఉలిక్కిపడి లేచాను. మా మరదలు మాలతి చిటికిన వేలుతో లేపడానికి సత్కరించింది. "శశీ!" అన్నాను కళ్లువిప్పుతూ. మామరదలు విరగబడి నవ్వి "నిద్రలోకూడా భార్యాగారిపేరే కలవరింపు...... ఎంత ప్రేమ!!!" అంది మూతి మూడు వంకలూ పెట్టుతూ... "మాలతీ! కొంటెపిల్లవుసుమీ" అన్నాను పెట్టినకాఫీ త్రాగుతూ... "మాలతీ! చాల్లే ఇలారా" అని కోపంతో పిలుపు. చూసేసరికి మాలతి శశితో నిష్క్రమించింది. నాలోనేనే నవ్వుకున్నాను.

**ముఖచిత్రము**

ఫేమస్ ఫిలింస్ & స్టార్ కంపెన్నీవారి "కృష్ణప్రేమ"లో "రాధ"గా నటించిన శ్రీమతి శాంతకుమారి.